ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో నేలమట్టమైన భవనం. పక్కన ధ్వంసమైన మసీదు

భీకర యుద్ధం

ఇజ్రాయెల్, పాలస్తీనా హమాస్ మిలిటెంట్ల మధ్య పోరు తీవ్రతరం

- ఇజ్రాయెల్‌లో 700 మంది మృతి
- గాజాలో 410మందికి పైగా మరణం
- ఇజ్రాయెల్ నగరాల్లో హమాస్ బీభత్సం
- స్థానికులతో పాటు విదేశీయుల నిర్బంధం
- హమాస్‌కు మద్దతుగా రంగంలోకి లెబనాన్ మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా
- ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతంపై దాడులు

ఇజ్రాయెల్‌లో 18 వేల మంది భారతీయులు

ఇజ్రాయెల్‌లో విద్య, ఉపాధి నిమిత్తం దాదాపు 18 వేల మంది భారతీయులు ఉన్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో ఉంటున్న భారతీయులందరూ సురక్షితంగానే ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపాయి. తాజా పరిణామాల నేపథ్యంలో తమను సురక్షితంగా తీసుకెళ్లాలని ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోయిన భారత పౌరులు, పర్యాటకులు టెల్‌అవివ్‌లోని ఇండియన్ ఎంబసీకి అభ్యర్థనలు పంపుతున్నారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇజ్రాయెల్, పాలస్తీనాలో ఉంటున్న భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని ఎంబసీ అధికారులు ఇప్పటికే సూచనలు చేసిన విషయం తెలిసిందే.

జెరూసలేం/టెల్ అవివ్, అక్టోబర్ 8: ఇజ్రాయెల్, పాలస్తీనా హమాస్ మిలిటెంట్ గ్రూప్ మధ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్నది. దాడులు, ప్రతిదాడులతో రెండు దేశాల్లోని ప్రభావిత ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. ప్రధానంగా గాజా స్ట్రిప్, ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంతంలో యుద్ధ ప్రభావం కనిపిస్తున్నది. ఇప్పటికే రెండు వైపులా 1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 5 వేల మందికి గాయాలయ్యాయి. హమాస్ గ్రూపు దాడుల్లో ఇజ్రాయెల్‌లో 44 మంది సైనికులతోసహా దాదాపు 700 మందికి పైగా మరణించగా, 2 వేల మందికి పైగా గాయాలయ్యాయని స్థానిక మీడియా నివేదికలు పేర్కొన్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో 413 మంది పౌరులు మరణించినట్టు గాజాలోని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. 400 మంది మిలిటెంట్లను హతమార్చారని, డజన్ల మందిని నిర్భందించామని ఇజ్రాయెల్ అధికారి ఒకరు వెల్లడించారు. శుక్రవారం తొలుత హమాస్ గ్రూపు అకస్మాత్తుగా ఇజ్రాయెల్ నగరాలపై వేలాది సంఖ్యలో రాకెట్లతో దాడులతో విరుచుకుపడగా, ఆ తర్వాత ఇజ్రాయెల్ కూడా అదే స్థాయిలో స్పందించడంతో పరిస్థితులు తీవ్రంగా మారాయి.

హమాస్ చెరలో ఇజ్రాయెల్ పౌరులు

తమ ప్రాంతాల్లోకి చొరబడిన హమాస్ సాయుధులను నిలువరించేందుకు ఇజ్రాయెల్ సైన్యం విశ్వప్రయత్నాలు చేస్తున్నది. మరోవైపు ఇదే సమయంలో గాజా స్ట్రిప్‌లోని హమాస్ స్థావరాలపై బాంబు దాడులు కొనసాగిస్తున్నది. ఇజ్రాయెల్‌లోకి చొరబడిన హమాస్ మిలిటెంట్లు.. వృద్ధులతో సహా పలువురు మహిళలు, చిన్న పిల్లలను నిర్బంధించారు. వారిని గాజాకు తరలించినట్టు సమాచారం. తద్వారా ఇజ్రాయెల్ నిర్భందించిన వేలాది మంది పాలస్తీనియన్ ఖైదీలను విడిచిపెట్టేందుకు హమాస్ బేరం ఆడే ప్రయత్నం చేస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

సరిహద్దు ప్రాంతాల నుంచి ఖాళీ

దాడుల నుంచి తప్పించుకొనేందుకు సరిహద్దు సమీపంలోని అటు ఇజ్రాయెల్, ఇటు గాజా ప్రజలు తమ ఇండ్ల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. హమాస్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రస్తుతం యుద్ధంలో ఉన్నదని ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. కాగా, హమాస్ దాడిని ముందస్తుగా పసిగట్టంలో ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ ఘోరంగా విఫలమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇజ్రాయెల్ స్థావరాలపై హెజ్బొల్లా దాడులు

ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంతంలో హమాస్ మిలిటెంట్ గ్రూపు, ఇజ్రాయిల్ సైన్యం మధ్య పోరు కొనసాగుతుండగా.. మరోవైపు హమాస్‌కు మద్దతుగా లెబనాన్‌కు చెందిన మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా రంగంలోకి దిగింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని వివాదాస్పద ప్రాంతాల్లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా ఆదివారం మోర్టార్ షెల్స్‌ను ప్రయోగించింది. దీనికి ఇజ్రాయెల్ సైన్యం దీటుగా స్పందించింది. ఆర్టిలరీ దాడులతోపాటు సరిహద్దు సమీపంలోని హెజ్బొల్లా స్థావరంపై డ్రోన్ దాడి చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

ఈజిప్టులో పోలీసు కాల్పుల్లో ఇజ్రాయెల్ టూరిస్టుల మృతి

ఈజిప్టులో ఆదివారం ఓ పోలీసు అధికారి ఇజ్రాయెల్ పర్యాటకులపై కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు ఇజ్రాయెల్ టూరిస్టులతో పాటు ఒక ఈజిప్టియన్ మరణించారని స్థానిక మీడియా పేర్కొన్నది. నిందితుడ్ని వెంటనే అరెస్టు చేశారని తెలిపింది.

బెత్లహామ్‌లో చిక్కుకొన్న రాజ్యసభ ఎంపీ

యుద్ధం నేపథ్యంలో భారత్ నుంచి జెరూసలేం పర్యటనకు వెళ్లిన మేఘాలయకు చెందిన రాజ్యసభ ఎంపీ వాన్‌వేయ్‌రాయ్ ఖార్లుఖీ బెత్లహామ్‌లో చిక్కుకున్నట్టు తెలుస్తున్నది. ఖార్లుఖీతోపాటు ఆయన కుటుంబస భ్యులు సహా మేఘాలయకు చెందిన 24 మంది చిక్కుకుపోయారు.

ఏమిటీ హెజ్బొల్లా గ్రూపు?

ఇరాన్ మద్దతుతో లెబనాన్‌లో 1975-90 అంతర్యుద్ధం సమయంలో హెజ్బొల్లా గ్రూపు ఏర్పాటైంది. లెబనాన్ ప్రాంతాలను ఆక్రమించిన ఇజ్రాయెల్ సైన్యంపై పోరాటానికి 1982లో ఇరాన్‌కు చెందిన రెవల్యూషనరీ గార్డ్స్ ఈ సంస్థను స్థాపించింది. ఇది అనంతర కాలంలో ఇక చిన్న గ్రూపు నుంచి లెబనాన్‌పై ఆధిపత్యం చెలాయించే భారీ సాయుధ దళంగా మారింది. ఇరాన్ షియా ఇస్లామిస్ట్ సిద్ధాంతాన్ని పంచుకొంటూ, చాలా మంది లెబనీస్ షియా ముస్లింలను హెజ్బొల్లా తమ దళంలో చేర్చుకొన్నది. ఇజ్రాయెల్ సైన్యం కొన్ని సంవత్సరాల పాటు హెజ్బొలా దళం చేసిన గెరిల్లా యుద్ధం.. 2000లో ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ బలగాలను వెనక్కు తగ్గేలా చేసింది. 2006లో ఐదు వారాల పాటు లెబనాన్ హెజ్బొల్లా గ్రూపు, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో రెండు దేశాలకు చెందిన వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. హెజ్బొల్లాను అమెరికాతో పాటు పలు దేశాల ఉగ్రవాద సంస్థగా పేర్కొన్నాయి.

జర్మన్ మహిళను చంపి.. నగ్నంగా ఊరేగించి..

ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరులో దారుణ ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాల్లోకి చొరబడిన హమాస్ గ్రూపు మిలిటెంట్లు స్థానిక పౌరులతోపాటు విదేశస్తులను కూడా నిర్బంధించి అమానుషంగా ప్రవర్తిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. హమాస్ మూకలు ఓ జర్మన్ మహిళను చంపేసి, నగ్నంగా ఇజ్రాయెల్ వీధుల్లో ఊరేగించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బయటకు వచ్చింది. బాధిత మహిళ ఇజ్రాయెల్ సైనికురాలని హమాస్ మొదట పేర్కొన్నది. అయితే ఆమె తన సోదరి శాని లౌక్ అని, ఒక టాటూ ఆర్టిస్టు అని బాధితురాలి సోదరి ఆది లౌక్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నట్టు న్యూయార్క్ పోస్టు నివేదించింది.

హమాస్ లక్ష్యం ఏమిటి?

- దానికి ఎవరు మద్దతిస్తున్నారు?

జెరూసలేం, అక్టోబర్ 8: ఇజ్రాయెల్‌పై మెరుపు దాడులకు దిగిన హమాస్ గురించి ఇప్పుడు అందరూ చర్చించుకుంటున్నారు. ఇస్లామిక్ రాజ్య స్థాపనే లక్ష్యంగా 1987లో అహ్మద్ యాసిన్, అబ్దెల్ అజీజ్ అల్ రాంటీసీ దీన్ని స్థాపించారు. ఈజిప్టుకు చెందిన ముస్లిం బ్రదర్‌హుడ్ విభాగంగా దీన్ని పేర్కొంటారు. హమాస్ (హర్కత్ అల్ ముక్వాలా అల్ ఇస్లామియా) అంటే ఉత్సాహం. పాలస్తీనాకు విముక్తి కల్పించడం.. ఇజ్రాయెల్, గాజాస్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలను కలిపి ఇస్లామిక్ రాజ్య స్థాపనే తమ లక్ష్యమని 1998 చార్టర్‌లో హమాస్ పేర్కొంది.

అరబ్ దేశాల మద్దతు...

హమాస్ ముఖ్యంగా అమెరికా పాలసీలను వ్యతిరేకిస్తుంది. దీనికి ఇరాన్, సిరియా, యెమెన్, లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్‌ల మద్దతు ఉంది. మరోవైపు అనేక అరబ్ దేశాలు హమాస్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. కాగా, ఇజ్రాయెల్, అమెరికా దీన్ని ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి. ఈ మేరకు 2018లో ఐరాసలో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన అమెరికా ఓటు కూడా వేసింది.

ఫతాతో వైరం...

1990లో యాసర్ అరాఫత్ స్థాపించిన ఫతాతో హమాస్‌కు ఎప్పటి నుంచో వైరం ఉంది. మొదట్లో ఆయుధాలు చేతబట్టిన ఫతా 1967 నాటి సరిహద్దులతో కూడిన పాలస్తీనా దేశ ఏర్పాటుకు ఐరాసలో ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు ప్రకటించింది. 2004లో అరాఫత్ మరణించాక.. గాజా స్ట్రిప్‌పై హమాస్ పట్టు బిగించింది. మరోవైపు వెస్ట్ బ్యాంక్‌పై ఫతాకు పట్టుంది.

హమాస్ తమను తాము ఇస్లామిస్ట్‌గా పేర్కొంటుండగా.. ఫతా లౌకికవాదానికి మద్దతుగా నిలుస్తున్నది. అయితే ఇజ్రాయెల్ విషయంలోనూ రెండింటికి వైరుధ్యాలు ఉన్నాయి. గాజాను హమాస్ తమ ఆధీనంలో ఉంచుకోగా.. పాలస్తీనాను మహమ్మద్ అబ్బాస్ పాలిస్తున్నారు. ప్రస్తుతం ఆయనే ఫతాను నడిపిస్తున్నారు.

అక్టోబర్ 6నే ఎందుకు?

జెరూసలేం: అది 1973 అక్టోబర్ 6. యూదులకు అత్యంత పవిత్ర రోజైన యోమ్ కిప్పూర్. దేశమంతా సంబరాల్లో మునిగితేలుతుండగా.. అరబ్ దేశాలు హఠాత్తుగా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగాయి. ఓ వైపు నుంచి సినాయ్ ద్వీపాన్ని తిరిగి పొందేందుకు ఈజిప్టు, మరోవైపు నుంచి గోలన్ హైట్స్ కోసం సిరియా ఇజ్రాయెల్‌పై యుద్ధం ప్రకటించాయి. 1967లో జరిగిన యుద్ధంలో ఈ రెండు ప్రాంతాలను ఇజ్రాయెల్ తన ఆధీనంలోకి తెచ్చుకుంది. అరబ్ దేశాలకు సోవియన్ యూనియన్ సాయం చేయగా.. ఇజ్రాయెల్ వైపు అమెరికా నిలబడింది. దీంతో యుద్ధం భీకరంగా సాగింది. పశ్చిమ దేశాలకు చమురు సరఫరాను నిలిపివేస్తూ ఒపెక్ దేశాలు నిర్ణయించాయి. రెండు వారాల తర్వాత ఇజ్రాయెల్ ఈ యుద్ధంలో విజయ తీరాలకు చేరింది. గతంలో ఉన్న ప్రాంతాల కంటే ఎక్కువ భూభాగాన్ని హస్తగతం చేసుకుంది. యోమ్ కిప్పూర్ యుద్ధంగా పిలుచుకునే దీంట్లో సుమారు 20 వేల మరణించారు. అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌ను అధికారికంగా ఓ దేశంగా గుర్తించడం ప్రారంభించాయి. అయితే సరిగ్గా ఈ యుద్ధం జరిగి 50 ఏండ్లు పూర్తయిన తర్వాత మళ్లీ అక్టోబర్ 6నే ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు దాడులకు దిగడం గమనార్హం.

బీజేపీ మళ్లీ వస్తే దేశానికి ముప్పే

- కేరళ సీఎం విజయన్ హెచ్చరిక

కన్నూరు, అక్టోబర్ 8: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపడితే దేశానికి తీవ్ర ముప్పేనని కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఉత్తర కేరళలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ బీజేపీ కనుక తిరిగి అధికారంలోకి వస్తే పెను ప్రమాదం ఏర్పడుతుందని, తర్వాత ప్రజలు పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పాలనను, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ గురించి ప్రస్తావిస్తూ అవి దేశ వైవిధ్యాన్ని నాశనం చేయాలని చూస్తున్నాయని, మత ప్రాతిపాదికన దేశాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కులం, మతం, జాతి, రంగు, భాష, ప్రాంతం, ఆచారం వంటి వాటితో సంబంధం లేకుండా చట్టం ప్రకారం అందరూ సమానమేనని, కానీ బీజేపీ పాలనలో ఆ భావనే మారిపోతున్నదని ఆయన విమర్శించారు.

'కులవివక్ష' బిల్లును తిరస్కరించిన కాలిఫోర్నియా గవర్నర్

వాషింగ్టన్, అక్టోబర్ 8: కులవివక్ష వ్యతిరేక బిల్లును అమెరికాలోని కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్ తిరస్కరించారు. ఇది అనవసరమైన బిల్లు అని, కులవివక్షను నిషేధిస్తూ రాష్ట్రంలో ఇప్పటికే చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. పౌరులు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? ఎక్కడ నివసిస్తున్నారు? అనేదానితో సంబంధం లేకుండా కాలిఫోర్నియాలో ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించేందుకు అర్హులని తాము విశ్వసిస్తామని అని గెవిన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'లింగం, జాతి, రంగు, మతం, జాతీయత పలు ఇతర అంశాల ఆధారంగా ఉండే అన్ని రకాల వివక్షను కాలిఫోర్నియా ఇప్పటికే నిషేధించింది. కుల ఆధారిత వివక్షపై కూడా ఈ క్యాటగిరీల కింద నిషేధం ఉన్నది. కాబట్టి ఈ బిల్లు అవసరం లేదు' అని అందులో స్పష్టం చేశారు. కుల వివక్ష వ్యతిరేక బిల్లును కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే. కాగా, బిల్లును వీటో చేస్తూ గవర్నర్ న్యూసమ్ తీసుకొన్న నిర్ణయాన్ని ఇండియన్-అమెరికన్ కమ్యూనిటీ స్వాగతించింది.

అదృశ్య కవచం.. ఐరన్‌డోమ్

- హమాస్ రాకెట్లను ధ్వంసం చేయడంలో కీలకపాత్ర
- నిమిషాల వ్యవధిలో వేల రాకెట్లు ప్రయోగించడంతో కొంత వరకు సక్సెస్ అయిన హమాస్ మిలిటెంట్లు



జెరూసలేం, అక్టోబర్ 8: ఇజ్రాయెల్‌పై అనూహ్య దాడులకు పాల్పడిన హమాస్ మిలిటెంట్లు నిమిషాల వ్యవధిలోనే 5 వేల రాకెట్లు ప్రయోగించారు. ఇజ్రాయెల్‌లోని నగరాలే లక్ష్యంగా గాజా నుంచి హమాస్ మిలిటెంట్లు ఈ దాడులకు దిగారు. అయితే ఇజ్రాయెల్ వద్ద అత్యాధునిక రక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ ఈ దాడులు ఎలా జరిగాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అసలేంటీ ఐరన్‌డోమ్?

రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్ అనే ప్రభుత్వ సంస్థ 2011లో దీన్ని తయారు చేసింది. ఈ వ్యవస్థ ద్వారా శత్రు దేశాల స్వల్ప శ్రేణి రాకెట్లు, క్షిపణులను అడ్డుకొని గాల్లోనే వాటిని తునాతునకలు చేస్తుంది. ఈ వ్యవస్థలో ఉండే బ్యాటరీలు తమ వైపు దూసుకొచ్చే రాకెట్ల వేగం, పథం (ట్రాజెక్టరీ), లక్ష్యాన్ని ముందుగానే పసిగట్టి వాటిని అడ్డుకుంటుంది. 2011లో గాజా నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీర్షేవాలో దీన్ని మొదటగా పరీక్షించారు. ప్రస్తుతం ఇటువంటి బ్యాటరీలు ఇజ్రాయెల్ వద్ద మొత్తం పది ఉన్నాయి.

ఎలా పనిచేస్తుంది?

ఐరన్ డోమ్‌లో మూడు వ్యవస్థలు ఉంటాయి. రాడార్, బ్యాటిల్ మేనేజ్‌మెంట్ అండ్ వెపన్ కంట్రోల్ సిస్టమ్(బీఎంసీ), మిసైల్ ఫైరింగ్ యూనిట్. శత్రువులు ప్రయోగించే రాకెట్లను రాడార్ పసిగట్టి.. దాని గమనాన్ని బీఎంసీకి పంపిస్తుంది. రాకెట్ వేగం, పడే ప్రాంతాలను అంచనావేసి మిసైల్ ఫైరింగ్ యూనిట్‌కు బీఎంసీ సందేశం అందిస్తుంది. అనంతరం ఐరన్‌డోమ్ నుంచి వెలువడే టమిర్ క్షిపణులు ప్రత్యర్థుల రాకెట్‌లను గాల్లోనే పేల్చేస్తాయి.

ఐరన్‌డోమ్ ఎలా విఫలమైంది?

ఐరన్‌డోమ్‌లో లోపాల కోసం హమాస్ మిలిటెంట్లు ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నారు. ఏకకాలంలో చాలా రాకెట్లను ప్రయోగిస్తే ఐరన్‌డోమ్ అడ్డుకోదని వారు గ్రహించారు. అందుకే 20 నిమిషాల వ్యవధిలో 5000 రాకెట్లను హమాస్ ఇజ్రాయెల్‌పై గురిపెట్టింది. మరో వైపు హమాస్ తమ రాకెట్ టెక్నాలజీని గణనీయంగా అభివృద్ధి చేసుకోవడంతో వారు ఐరన్‌డోమ్ కళ్లుగప్పడంలో సఫలమయ్యారు. అయినప్పటికీ ప్రస్తుత దాడిలో 90 శాతం రాకెట్లను ఐరన్‌డోమ్ అడ్డుకుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇజ్రాయెల్ దళాలు ప్రయోగించిన రాకెట్లధాటికి గాజాలో మంటలంటుకున్న భవనం

దిగ్బంధంలో గాజా

బిక్కుబిక్కుమంటున్న 20 లక్షల మంది

గాజా, అక్టోబర్ 8: హమాస్ పాలనలో ఉన్న గాజా స్ట్రిప్ ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం కారణంగా దిగ్బంధంలో చిక్కుకున్నది. అత్యంత జనసాంద్రత ఉండే గాజాలో 362 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలోనే సుమారుగా 20 లక్షల మంది నివసిస్తున్నారు. రెండు దేశాలు జల, వాయు, గగనతలాల్లో ఆయుధాలను మోహరించడంతో ఇప్పుడు వారంతా బిక్కుబిక్కుమంటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. ఎటునుంచి మృత్యువు వస్తుందో తెలియక చావు భయంతో నరకయాతన అనుభవిస్తున్నారు. గాజాకు తూర్పు, ఉత్తర భాగాల్లో ఇజ్రాయెల్, దక్షిణాన ఈజిప్టు, పశ్చిమ భాగంలో మధ్యదరా సముద్రం సరిహద్దులుగా ఉన్నాయి. యుద్ధం కారణంగా ఇరుదేశాలు జల, వాయు, భూ దిగ్బంధాన్ని విధించాయి. దీంతో గాజా వాసులు ఎటువెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో 2005-06లో తాత్కాలికంగా, 2007లో శాశ్వతంగా ఇలా గాజా దిగ్బంధంలో చిక్కుకుంది. కాగా, 2007లో గాజాను హస్తగతం చేసుకున్న నాటి నుంచి ఈ 15 ఏండ్లలో ఇజ్రాయెల్‌పై హమాస్ ఐదుసార్లు దాడులకు దిగింది.

14 వరకు విమాన సర్వీసులు రద్దు: ఎయిర్ ఇండియా

జెరూసలేం: ఇజ్రాయెల్, హమాస్ గ్రూపు మధ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో వైమానిక సంస్థ ఎయిరిండియా వారం పాటు విమాన సర్వీసులను రద్దు చేసింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత దృష్యా టెల్ అవీవ్‌కు రాకపోకలు సాగించే ఎయిరిండియా విమానాలను ఈ నెల 14 వరకు నిలిపివేస్తున్నట్టు సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. టికెట్ బుక్ చేసుకొన్న ప్రయాణికులకు అన్ని విధాలుగా సహకరిస్తామని పేర్కొన్నది.

బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరు తప్పనిసరి కాదు

- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకూడదనే 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలన్న నిర్ణయం తీసుకున్నామని, వీటికి హాజరుకావటం తప్పనిసరి కాదని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. బోర్డు పరీక్షలు ఒకేసారి నిర్వహించటం వల్ల విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి నెలకొంటుందన్న ఉద్దేశంతోనే ఈ మార్పులు చేశామన్నారు. ఆదివారం ఆయన పీటీఐతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. కొత్త పరీక్షల విధానాన్ని 2024 నుంచి అమల్లోకి తెస్తామన్నారు. రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యపై మాట్లాడుతూ, 'ఇది చాలా సున్నితమైన అంశం.విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడకుండా చేయటం మనందరి బాధ్యత' అని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో వెలుస్తున్న 'డమ్మీ స్కూల్స్'పై సీరియస్‌గా చర్చ జరగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'డమ్మీ స్కూల్స్' ఫుల్‌టైం క్లాసులు నిర్వహించటం లేదు. అందులో చేరిన విద్యార్థుల్ని నీట్, జీఈఈ కోచింగ్ కోసం రాజస్థాన్‌లోని 'కోటా'కు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి నెలకొంటున్నదని, కోచింగ్ సెంటర్లలో సరైన మార్కులు రాకపోయేసరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

ముడిచమురు.. మోదీ మాయ!

- పెట్రోల్ ధరలపై కేంద్రం జిమ్మిక్కులు
- ఎన్నికలుంటే ఒకలా.. లేకుంటే మరోలా

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుంటాయ్.. కానీ దేశంలో పెట్రో ధరలు పెరుగుతుంటాయి.. ఎందుకంటే అప్పుడు ఎన్నికలుండవ్. ధరల పెరుగుదలపై కేంద్రాన్ని నిలదీస్తే తామేం చేస్తాం.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల్లో హెచ్చుతగ్గులే కారణమంటూ దాటవేస్తుంది. ఇప్పుడు ముడిచమురు ధరలు పెరుగుతుంటయ్.. కానీ పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం పెరుగవు.. కారణం ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు.. మరో ఐదారు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉండటమే. ఇదీ మోదీ సర్కారు 'ఇంధన' రాజకీయం. ఈ విషయం ప్రముఖ క్రెడిట్ రేటింగ్ సంస్థ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ నివేదికలో బట్టబయలు అయ్యింది. మోదీ సర్కారు చెప్పిన ముడిచమురు అంతర్జాతీయ సూత్రీకరణ డొల్ల అని తేలింది.

నష్టాలొచ్చినా ధరలు పెంపు లేదు..

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినా.. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న కారణంగా పెట్రో ధరలు పెరుగకపోవచ్చునని 'మూడీస్' అంచనావేసింది. దేశంలోనే 90% మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వ రిటైల్ సంస్థలు ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ 18 నెలలుగా ఇంధన ధరలను స్థిరంగా ఉంచుతున్నాయని, నిరుడు క్రూడాయిల్ ధర భారీగా పెరిగినా.. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఈ మూడు సంస్థలకూ భారీగా నష్టాలొచ్చినా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచలేదని పేర్కొన్నది. ఈ ఏడాది ఆగస్టు నుంచి అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరుగుతున్నా.. రిటైల్ సంస్థల మార్జిన్లు నెగెటివ్‌లోకి వెళ్తున్నా ఇంధన ధరల్ని పెంచకపోవడానికి కారణం రాబోయే ఎన్నికలేనని నివేదికలో వెల్లడించింది. 2023-24 ప్రథమార్థంలో ముడిచమురు బ్యారెల్ ధర 78డాలర్లు ఉండగా.. సెప్టెంబర్ నాటికి 90 డాలర్లకు చేరుకొంది.

వైద్యుల సైన్‌బోర్డులపై పరిమితులు

న్యూఢిల్లీ : వైద్యులు ఏర్పాటుచేసుకొనే సైన్ బోర్డులు, రోగులకు వారు ఇచ్చే ప్రిస్క్రిప్షన్ పేపర్లపై ఏయే అంశాలు ఉండాలన్న దానిపై నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు (ఈఎంఆర్‌బీ) కొత్త సూచనలు చేసింది. సైన్‌బోర్డులపై వైద్యుడి పేరు, విద్యార్హతలు, అనుభవం వివరాలు, ప్రత్యేకతలు, రిజిస్ట్రేషన్ నంబర్, అవార్డులు తప్ప అనవసర అంశాలను రాయకూడదని ఎన్ఎంసీకి సమర్పించిన 'ప్రొఫెషనల్ కాండక్ట్ రివ్యూ- లెసన్స్ ఫ్రం కేస్ ఆర్కైవ్స్' ఈ బుక్‌లో సూచించింది. వైద్యులు-రోగుల మధ్య నమ్మకం పాదుకొల్పేందుకు మరిన్ని చర్యలు చేపట్టాలని ఎన్ఎంసీకి సూచించింది.